సాక్షి సిద్దిపేట

శుక్రవారం । 19 । మే । 2023



ఉసురు తీసిన ఆలుమగల కొట్లాట

ఆలుమగల కొట్లాటలో క్షణికావేశానికి లోనైన భార్య నీటి కుంటలో దూకింది. భార్యను కాపాడే ప్రయత్నంలో ఇద్దరూ మృతి చెందారు. 8లో



పల్లెల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

పల్లెల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించి చర్యలు చేపడుతుందని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అన్నారు. 9లో

20న మినీజాబ్ మేళా

సిద్దిపేటరూరల్: జిల్లా కేంద్రంలోని సెట్విన్ భవన్‌లో ఈ నెల 20న మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి నీల రాఘవేందర్ తెలిపారు. సుశ్రిత ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్, వరుణ్ మోటార్స్‌లో సేల్స్ అండ్ సర్వీసెస్‌లో ఖాళీలకు పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. వివరాలకు సంపత్ 9866019366, వేదవ్యాస్ 99856 78292 నంబర్లలో సంప్రదించాలన్నారు.

న్యూస్‌రీల్

పెండింగ్ సమస్యలు పరిష్కరిస్తా

వంటేరుకు సీఎం హామీ



సీఎం కేసీఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రతాప్‌రెడ్డి, చిత్రంలో మంత్రి హరీశ్‌రావు

గజ్వేల్: నియోజకవర్గంలో పెండింగ్ సమస్యలు పరిష్కరిస్తానని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డికి సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. బుధవారం రాత్రి రాష్ట్ర మంత్రి హరీశ్‌రావుతో కలిసి ప్రగతి భవన్‌లో సీఎంను కలిసి నియోజకవర్గ సమస్యలను వివరించారు. జగదేవ్‌పూర్ మండలంలో మహాత్మా జ్యోతిరావుపూలే పాఠశాల, కళాశాల నిర్మాణం, కొండపోచమ్మ ఆలయ పునర్నిర్మాణం, నాచారం ఆలయ అభివృద్ధి తదితర పనులకు ఆదేశాలివ్వాలని కోరినట్లు తెలిపారు. ఈ మేరకు సీఎం సానుకూలంగా స్పందించారని ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

పరీక్షా కేంద్రం వద్ద 144సెక్షన్

సిద్దిపేటకమాన్: ఈ నెల 19న పొన్నాల శివారు ఇందూర్ ఇంజినీరింగ్ కళాశాలలో టీఎస్‌పీఎస్సీ సీబీఆర్‌టీ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పరీక్ష జరగనున్నందున కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత తెలిపారు. ఉదయం 6నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిబంధనలు అమల్లో ఉంటాయని, కేంద్రం నుంచి 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడి ఉండొద్దని, కేంద్రం పరిధిలో అన్ని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని సూచించారు.

ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పెరిగింది

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



మహిళలకు కళ్లద్దాలు పెడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించేందుకు సర్కారు కృషి చేస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. గురువారం మండలంలోని విఠలాపూర్‌లో కంటి వెలుగు శిబిరం, స్టీల్ బ్యాంకును ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మంత్రి హరీశ్‌రావు చొరవతో వైద్యరంగంలో ఎన్నో మార్పులు జరిగాయని, ప్రజలు ఆస్పత్రు చుట్టూ తిరగకుండా ఊళ్లోనే పరీక్షలు చేయించుకోవాలన్నారు. కంటి వెలుగుతో నిరుపేదల జీవితాల్లో కొత్త వెలుగులు కనిపిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో గంగాపూర్ సొసైటీ చైర్మన్ కనకరాజు, రైతుబంధు జిల్లా సభ్యుడు వెంకటేశం, సర్పంచ్ నవీన్, ఎంపీటీసీ సునీత సాగర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ సోమిరెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేటరూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలో 2023–24 సంవత్సరానికిగాను నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ట్రైనింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బలక్ష్మి తెలిపారు. పదో తరగతి పూర్తయిన వారు www.iti.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా జూన్ 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, కోపా, మెకానికల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కలెక్టరేట్ ఎదుట వీఓఏల నిరసన



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

సిద్దిపేటరూరల్: వీఓఏల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం గోపాలస్వామి మాట్లాడుతూ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.26వేలు వేతనం అందించాలని, రూ.10 లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. సెర్ప్ ద్వారా గుర్తింపు కార్డులు అందించి, గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతీ నెలా వేతనాలు అందించాలన్నారు. కార్యక్రమంలో మండలాల వీవోఏలు, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్.. ఆర్.. ఆర్

రెడ్యూస్.. రీ యూజ్.. రీ సైకిల్

- నిరుపయోగ వస్తువుల సేకరణ లక్ష్యంగా.. మేరీ లైఫ్, మేరా స్వచ్ఛ్ షహర్
- మున్సిపల్ వార్డుల్లో కేంద్రాల ఏర్పాటు

సాక్షి, సిద్దిపేట: పట్టణాలను స్వచ్ఛంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో మేరీ లైఫ్, మేరా స్వచ్ఛ్ షెహర్ కార్యక్రమంలో భాగంగా వార్డుల్లో ట్రిపుల్ ఆర్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. గృహాల్లో నిరుపయోగంగా ఉన్న సామగ్రి, ప్లాస్టిక్ డబ్బాలు, రేకులు, పుస్తకాలు, పేపర్లు, దుస్తులు, చెప్పులు, షూలు, తదితర వస్తువులను ట్రి పుల్ ఆర్ (రెడ్యూస్, రీయూజ్, రీ సైకిల్) కేంద్రాల్లో సేకరించనున్నారు. ఇందుకోసం ప్రతీ వార్డుల్లో తాత్కాలికంగా ట్రిపుల్ ఆర్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల మున్సిపాలిటీల్లో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

వార్డుకో కేంద్రం..

- లక్ష జనాభా కంటే ఎక్కువ ఉన్న మున్సిపాలిటీల్లో వార్డుకు ఒకటి చొప్పున ట్రిపుల్ ఆర్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.
- సిద్దిపేట మున్సిపాలిటీలో వార్డు ఒకటి చొప్పున తాత్కాలిక ట్రిపుల్ ఆర్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు.
- గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల మున్సిపాలిటీల్లో రెండు వార్డులకు కలిపి ఒక ట్రిపుల్ ఆర్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు.
- ఆయా మున్సిపాలిటీల్లో తాత్కాలికంగా ఏర్పాటు చేసే కేంద్రాలను గుర్తిస్తున్నారు. వాటిని ఫొటో తీసి, జియో ట్యాగ్ చేసి స్వచ్ఛత పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.
- ఈ నెల 20 నుంచి జూన్ 5వ తేదీ వరకు ప్రజలకు అవగాహన కల్పించనున్నారు.
- ఈ కేంద్రాల్లో వార్డు అధికారి, కౌన్సిలర్, ఆర్‌పీ, మహిళా సంఘాలు, పారిశుధ్య సిబ్బంది, పది మంది వలంటీర్లు ఉంటారు.
- గృహాల్లో నిరుపయోగ వస్తువులు, చెత్త చెందారం పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవచ్చు. ఇంటి వద్దకు వచ్చే మున్సిపల్ సిబ్బందికి చెత్తను ఇవ్వడం తగ్గుతుంది.
- ప్రజలకు అవగాహన కల్పించిన అనంతరం ప్రతీ మున్సిపాలిటీలో ఒకటి చొప్పున పర్మినెంట్ ట్రిపుల్ ఆర్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.
- స్వచ్ఛత, మేరి లైఫ్ మేరా స్వచ్ఛ్ షెహర్ పోర్టల్‌లో ప్రతీ రోజు వస్తువులు తీసుకువచ్చిన వారి వివరాలను అప్‌లోడ్ చేస్తారు.
- ఇలా మున్సిపల్ స్థాయిలో ఎక్కువ సామగ్రి కలెక్ట్ చేసిన వార్డుకు జూన్ 5వ తేదీని అవార్డును అందించనున్నారు.
- వీటి ఆధారంగా అత్యధికంగా కలెక్ట్ చేసిన మున్సిపాలిటీలకు ఢిల్లీలో అవార్డులు ఇవ్వడంతో పాటు సత్కారం ఉంటుంది.
- కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తే మున్సిపాలిటీలకు స్వచ్ఛ సర్వేక్షన్‌లో మార్కులు సైతం కేటాయించనున్నారు.



సిద్దిపేటలో ట్రిపుల్ ఆర్ కేంద్రం ఫొటోను జియో ట్యాగ్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మున్సిపాలిటీ	వార్డులు	ఇళ్లు	జనాభా
సిద్దిపేట	43	41,322	1,57,026
గజ్వేల్	20	11,616	55,616
హుస్నాబాద్	20	8,350	29,115
దుబ్బాక	20	8,500	35,000
చేర్యాల	12	5,920	20,123

ప్రజలకు అవగాహన కల్పిస్తాం



సిద్దిపేట పట్టణంలో వార్డుకు ఒకటి చొప్పున ట్రిపుల్ ఆర్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. వార్డు అధికారిని నోడల్ ఆఫీసర్ నియమించాం. 20 నుంచి ప్రారంభించేందుకు ఏర్పాటు చేస్తున్నాం. దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. ఇంట్లో పాడై, పనికిరాని వస్తువులను తీసుకువచ్చి ట్రిపుల్ ఆర్ కేంద్రాల్లో అందించాలి.

– సంపత్ కుమార్, మున్సిపల్ కమిషనర్, సిద్దిపేట

ఆయిల్‌పాం టార్గెట్ 18 వేల ఎకరాలు



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్

- కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్
- ఉద్యానవన, ఆయిల్‌ఫెడ్ అధికారులతో సమీక్ష

సిద్దిపేటరూరల్: జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఆయిల్ పాం సాగు టార్గెట్ 18వేల ఎకరాలుగా నిర్ణయించామని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, ఉద్యానవన, ఆయిల్ ఫెడ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయిల్‌పాం సాగులో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు అధికారులు కృషి చేయాలని అన్నారు. గతేడాది జిల్లాలో 5,500 ఎకరాల్లో సాగైందని, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని లక్ష్యానికి అగుణంగా ప్రణాళికాబద్ధంగా ముందుకుసాగాలన్నారు. మండలం, క్లస్టర్‌ల వారిగా ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని, మొక్కలు నాటించడం, గతంలో నాటిన మొక్కల సంరక్షణపై వ్యవసాయ అధికారులు ఏడీఏ, ఏఈఓ, ఏఓలు రైతులకు వివరించాలన్నారు. రైతుల ఎంపిక, డీడీ కలెక్షన్లు, మార్కింగ్, డ్రిప్ ఫిట్టింగ్, మొక్కలు నాటించడంపై ఎప్పకప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. జూన్ జూలై, ఆగస్టు నెలలోనే 50శాతం సాగు చేపట్టేలా చూడాలన్నారు. పెద్ద భూస్వాములతో పాటు చిన్న, సన్న కారు రైతులకు ఆయిల్‌పాంపై అవగాహన కల్పించాలని, అంతర పంటగా జనుము, జీలుగ పంటలు వేయడంతో కలిగే అదనపు ఆదాయంపై వివరించాలన్నారు. అంతకుముందు కోర్ కార్బనెక్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు తడి–పొడి పద్ధతిలో వరి సాగులో పొలంలో అమర్చుకునే నీటి గొట్టం నిర్మాణం, పాటించవలసిన జాగ్రత్తలు, కలిగే ప్రయోజనాలపై అధికారులకు వివరించారు. సమావేశంలో డీఆర్డీఏ పీడీ చంద్రమోహన్ రెడ్డి, డీఏఓ శివప్రసాద్, డీహెచ్ఓ సునీత, ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ మేనేజర్ సురేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో స్లాటర్ హౌస్ సేవలు

సిద్దిపేటజోన్: పరిశుభ్రతలో సిద్దిపేటను అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల అన్నారు. త్వరలో మోడల్ స్లాటర్ హౌస్ అందుబాటులోకి రానుందని తెలిపారు. గురువారం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ విజిత, మున్సిపల్ కమిషనర్ సంపత్, మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజుతో కలిసి పట్టణ శివారులో నిర్మించిన స్లాటర్ హౌస్‌లో మాంస విక్రదారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. త్వరలో మంత్రి చేతుల మీద దీనిని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్లాటర్ హౌస్‌లో వసతులు, ఏర్పాట్లపై వివరించారు. మాంసం విక్రయాలకు తప్పనిసరి కబేళా సేవలు వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు మహేష్, శ్రీనివాస్ రెడ్డి, సతీష్, వనిత, మాంస వ్యాపారులు పాల్గొన్నారు.



స్లాటర్ హౌస్‌పై విక్రయదారులకు అవగాహన కల్పిస్తున్న ప్రజాప్రతినిధులు

పోస్టర్ ప్రజెంటేషన్

సిద్దిపేటఎడ్యుకేషన్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలుగులోకి తీసుకురావడానికి పోస్టర్ ప్రజెంటేషన్ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని సిద్దిపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీవన్‌కుమార్ అన్నారు. గురువారం బీకాం మొదటి సంవత్సరం విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు బ్యాంకు పథకాలు, ఔత్సాహికులపై పోస్టర్ తయారు చేశారు. అనంతరం ఉత్తమ ప్రతిభ చూపిన మానస, రాజ్యలక్ష్మికి, పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీతారాములు, అధ్యాపకులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ సువర్ణాదేవి, కామర్స్ విభాగాధిపతి శ్రీహరిప్రసాద్, కిషోర్, జ్యోతి పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం అందించాలి



మాట్లాడుతున్న సీపీ శ్వేత, పక్కన అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్

- పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత

సిద్దిపేటకమాన్: వివిధ కారణాలతో భరోసా సెంటర్‌కు వచ్చే బాధితులకు అవసరైన న్యాయ సలహాలు, సూచనలు సత్వరం అందించాలని పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత సిబ్బందికి సూచించారు. గురువారం భరోసా సెంటర్ సిబ్బందితో సీపీ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పోక్సో, లైంగిక దాడి కేసుల్లో బాధితులు భరోసా సెంటర్‌కు రాగానే సంబంధిత అధికారులు వారికి న్యాయపరంగా సలహాలు అందించాలని, బాధితులకు కుటుంబసభ్యులు లేకపోతే సిద్దిపేట బాలసదన్‌లో ఆశ్రయం కల్పించాలన్నారు. పరిహార సంబంధిత కేసులను త్వరగా లిస్టవుట్ చేయాలని మహిళా సీఐ దుర్గకు ఆదేశించారు. ఇప్పటి వరకు 113 పోక్సో, 30 లైంగిక, 5 మిస్సింగ్ కేసుల్లో మొత్తం 143 మంది బాధితులకు భరోసా కల్పించి, 37 మంది బాధితుల ఇళ్లను సందర్శించి, 20 మందిని రిహబిలిటేషన్ సెంటర్‌కు పంపించినట్లు పేర్కొన్నారు. భరోసా సెంటర్ సేవలపై పట్టణాలు, గ్రామాల్లో 58చోట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, సెంటర్ ఫండ్ నుంచి 184 మంది మహిళలకు రూ.65,45,000 ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు. గృహహింస, వేధింపులపై వచ్చిన 415 దరఖాస్తుల్లో 338 పరిష్కరించినట్లు వివరించారు. భరోసా సెంటర్ సేవలకు 08457–293098, డయల్ 100కు, గృహహింస, వరకట్నం, వేధింపులకు గురైతే 9494639498 నంబర్‌కు ఫోన్‌చేయాలన్నారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న భరోసా సెంటర్ భవనాన్ని పరిశీలించారు. పనులు నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, భరోసా సెంటర్ సిబ్బంది అనూష, వినోద, సౌమ్య, హరిత, రేణుక, భవాని, నవనీత, స్నేహిత మహిళా సపోర్ట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ సుజాత, సిబ్బంది వసంత, సుష్మ, ఫీల్డ్ వర్కర్ సూర్యప్రభ, స్వరూప, నాగరాజు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

హుస్నాబాద్: విధి నిర్వహణలో పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీపీ శ్వేత అన్నారు. గురువారం హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈసందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించి పోలీస్‌ల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేసి, కేసుల పురోగతిపై అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ రికార్డ్స్, సీడీ ఫైల్స్, ఇన్వెస్టిగేషన్‌పై సంతృప్తి వ్యక్తి చేసి, ఎస్‌ఐ, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో ఏసీపీ సతీష్, సీఐ కిరణ్, ఎస్‌ఐ మహేష్ ఉన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ శ్వేత

ఇంకుడుగుంతలతో భూగర్భజలాల పెంపు

- డీపీఓ దేవకీదేవి

కొండపాక(గజ్వేల్): ఇంకుడుగుంతల ఏర్పాటుతో భూగర్భజలాలు పెరుగుతాయని జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి పేర్కొన్నారు. పల్లె ప్రగతి వారోత్సవాల్లో భాగంగా గురువారం కుకునూరుపల్లి మండలం మంగోల్, కుకునూరుపల్లి, మాత్‌పల్లి గ్రామాల్లో పర్యటించి పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. అనంతరం మంగోల్‌లో ఇంకుడుగుంత నిర్మాణాన్ని ప్రారంభించారు. పల్లె ప్రగతి నిర్వహణకు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా రోడ్ల ప్రక్కన ప్రమాదకర బావులు, గుంతల పూడ్చివేత, ముళ్లంల పొదల తొలగింపు, మురికి కాలువల శుభ్రత చేపట్టినట్లు తెలిపారు. ప్రతీ పంచాయతీలో మురికి కాలువల ముగింపు వద్ద ఇంకుడు గుంతలను నిర్మించాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభంలో సీజనల్ వ్యాధులు ప్రభలకుండా పల్లె ప్రగతి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పుల్లోజు కిరణ్‌కుమార్, పొల్కంపల్లి జయంతి, బచ్చలి మహిపాల్, ఆత్మ కమిటీ డైరెక్టర్ లగిశెట్టి కనకయ్య, పీఎస్ఆర్ ట్రస్ట్ నిర్వాహకుడు పొల్కంపల్లి నరేందర్, ఎంపీడీఓ రాంరెడ్డి, ఉపసర్పంచ్ బాలాగౌడ్, నాయకులు సంపత్, నాగరాజు, సత్తయ్య, కరుణాకర్, కిష్టారెడ్డి పాల్గొన్నారు.



మంగోల్‌లో ఇంకుడుగుంత నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న డీపీఓ దేవకీదేవి

మత్స్యకారులకు ఊరట

- అర్హులకు గుర్తింపు కార్డులు
- తొలిసారిగా సిద్దిపేటలో పంపిణీ
- మరో 12,460 మందికి సభ్యత్వాలు



అర్హులకు గుర్తింపుకార్డు అందిస్తున్న మంత్రులు తలసాని, హరీశ్‌రావు



చేపలు పడుతున్న మత్స్యకారులు (ఫైల్)

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కులవృత్తులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతుంది. గంగపుత్రులు, ముదిరాజ్‌లకు ఆర్థిక చేయూత అందించేందుకు ఏటా ఉచిత చేప పిల్లలను పంపిణీ చేస్తోంది. ఇప్పటికే చేపలను విక్రయించుకునేందుకు గ్రామాల్లో మత్స్య సొసైటీ సభ్యులకు అవకాశం కల్పించగా, త్వరలో అర్హులకు గుర్తింపు కార్డులను అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాలో 283 మత్స్య సొసైటీల్లో 20,500మంది సభ్యులుగా ఉండగా, మరికొంత మందికి సభ్యత్వం అందించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలో తొలిసారిగా సిద్దిపేట జిల్లాలో మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, హరీశ్‌రావు చేతుల మీదుగా ఆర్థికశాఖ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

గుర్తింపుతో లాభాలు..

జిల్లాలో మత్స్యకారులకు ఇప్పటి వరకు ఎలాంటి గుర్తింపు కార్డులు లేవు. తాజాగా మంత్రులు పంపిణీ చేసిన గుర్తింపు కార్డులతో మత్స్యకారులకు గుర్తింపు లభించనుంది. మత్స్యకారులకు అందించిన గుర్తింపు కార్డుపై మత్స్యకారుడి పేరు, సొసైటీ వివరాలు, వయసు, సభ్యుడి పూర్తి వివరాలతో కూడిన క్యూర్ కోడ్ ఉంటుంది. ఈ కోడ్‌ను స్కాన్ చేస్తే మత్స్యకారుని వివరాలు తెలుస్తాయి. ఈ కార్డు ద్వారా 18 నుంచి 70 ఏళ్ల లోపు వయసు ఉన్నవారి రూ.5లక్షల ఉచిత ప్రమాద బీమా, అన్ని రకాల సబ్సిడీలు, సహాయాలు అందనున్నాయి. మత్స్యకారులకు ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు, వలలు తదితర సామగ్రి ఉచితంగా పొందే అవకాశం లభిస్తుంది.

పెరగనున్న లబ్ధిదారులు

జిల్లాలో ఇప్పటికే 283 సొసైటీల పరిధిలో 20,500మంది సభ్యులు ఉండగా, నూతనంగా మరో 12,460 మందికి ప్రయోజనం చేకూరనుంది. దీంతో మత్స్యకారుల సభ్యత్వాలు 33వేలకు చేరుకోనున్నాయి. జిల్లాలో 3,443 చెరువులు, కుంటలు ఉన్నాయి. జిల్లాలోని మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, రంగనాయకసాగర్, పరిధిలో మత్స్యకారులకు చేపలు పట్టుకునేందుకు ప్రభుత్వం ఇటీవల అవకాశం కల్పించింది.

ప్రయోజనాలెన్నో..



తొలిసారిగా సిద్దిపేట మత్స్యకారులకు గుర్తింపు కార్డులను అందించాం. ఈ కార్డుతో సంక్షేమ పథకాలు, సబ్సిడీలు, బీమా ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుంది. జిల్లాలోని అర్హులందరికీ త్వరలో కార్డులను అందిస్తాం. కొత్తగా 12,460 మందికి సొసైటీలలో సభ్యత్వం అందిస్తాం.

– మల్లేశం, మత్స్యశాఖ జిల్లా అధికారి

క్లుప్తంగా

అతిగా మద్యం సేవించిన వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: అతిగా మద్యం సేవించిన ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ప్రసాద్ రావు కథనం ప్రకారం..పటాన్‌చెరు పట్టణంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన నందు(46) కూలీ పనిచేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. ఆరు సంవత్సరాల క్రితం భార్య ప్రభావతి తన ఇద్దరు పిల్లలు వినీల్, అక్షయలను తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్న నందు మద్యానికి బానిసైయ్యాడు. కూతురు వద్ద సాయి కాలనీలో ఉంటున్న తల్లి శోభ కుమారుడిని చూసేందుకు అంబేడ్కర్ కాలనీకి వచ్చింది. అక్కడ ఇంట్లో సోపాపై కూర్చున్న చోటే నందు మృతి చెంది ఉన్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు షోకాజ్ నోటీసులు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని కొడకంచి గ్రామ జూనియర్ పంచాయతీ కార్యదర్శి సాధనను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సర్పంచ్ శివరాజ్, ఉపసర్పంచ్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. కొడకంచి గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య నిర్వహణలో అలసత్వం, అవెన్యూ ప్లాంటేషన్ నిర్వహణ, మురికి కాలువలు, రోడ్లను శుభ్రంగా ఉంచటం, క్యాష్‌బుక్ నిర్వహణ, చెత్త సేకరణ, తడి, పొడి చెత్త వేరుచేయటం, డంపింగ్ యార్డు నిర్వహణలో నిర్లక్ష్యం వహించటంతో కార్యదర్శిని సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. ఇందుకు కారణమైన సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు షోకాజ్ నోటీలు జారీ చేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, బీజేఆర్ చౌరస్తాతో పాటు పలు ప్రధాన చౌరస్తాల్లో తమ సిబ్బందితో నాలుగు రోజుల క్రితం డ్రంకెన్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మద్యం సేవించి పట్టుబడ్డ 9మంది వాహనదారులను గురువారం కోర్టులో హాజరుపరచగా విచారణానంతరం న్యాయమూర్తి వారికి రూ.22వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహన దారులకు సంగారెడ్డి కోర్టు జరిమాన విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి కథనం ప్రకారం..మంగళ, బుధవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 17మంది పట్టుబడ్డారు. వారిని సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా జడ్జి 15 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేలు, మరో ఇద్దరికి రూ.5వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

ఉసురు తీసిన ఆలుమగల కొట్లాట

- భార్యను కాపాడే యత్నంలో భర్త మృతి
- కన్నవారి ప్రేమకు దూరమైన చిన్నారులు
- నార్సింగిలో విషాదం


నగేశ్


స్వరూప (ఫైల్)


నీటి కుంటలో నగేశ్, స్వరూప మృతదేహాలు

పాపన్నపేట(మెదక్): ఆలుమగల కొట్లాటలో క్షణికావేశానికి లోనైన భార్య నీటి కుంటలో దూకింది. భార్యను కాపాడే ప్రయత్నంలో ఇద్దరూ మృతి చెందారు. పాపన్నపేట మండల పరిధిలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో వెలుగు చూసిన ఈ విషాదకర సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. నార్సింగి గ్రామానికి చెందిన దారబోయిన నారాయణ, లచ్చమ్మ దంపతులకు నలుగురు కూతుళ్లు, ఒక కొడుకు నగేశ్(35) ఉన్నారు. 13ఏళ్ల క్రితం బోడగట్టు గ్రామానికి చెందిన స్వరూప(32)తో వివాహం చేశారు. వీరికి భిక్షపతి, మల్లికార్జున్ ఇద్దరు కొడుకులు ఉన్నారు. గత నెల నుంచి నగేశ్, స్వరూప దంపతులు శ్రీనివాస్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో పనికి కుదిరారు. అక్కడ వ్యవసాయ పనులతో పాటు, పశువులను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల కొంత కాలం నుంచి నగేశ్ మద్యానికి అలవాటు పడ్డాడు. అప్పటి నుంచి భార్యభర్తలు తరచూ గొడవ పడుతుండేవారు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఇరువురు వ్యవసాయ క్షేత్రంలో మరోసారి కొట్లాడి ఉండొచ్చని భావిస్తున్నారు. దీంతో క్షణికావేశానికి లోనైన భార్య స్వరూప నీటి కుంటలో దూకింది. వెంటనే ఆమెను రక్షించే యత్నంలో భర్త కుంటలోకి దూకి, ఆమె కొంగు, కాళ్లు పట్టుకొని ఒడ్డుకు చేర్చే ప్రయత్నంలో ఊపిరాడక ఇద్దరు మృతి చెందారు.

నీటి కుంటలో మృతదేహాల వెలికితీత

బుధవారం సాయంత్రం కుటుంబీకులు వ్యవసాయ క్షేత్రంలో వెతకగా నీటి కుంట వద్ద చెప్పులు, నగేశ్ బట్టలు కనిపించాయి. దీంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అందరు కలసి రాత్రి పూట వెతికినప్పటికీ వారి ఆచూకీ లభించలేదు. గురువారం తెల్లవారు జామున నగేశ్, స్వరూప మృతదేహాలు నీటిలో తేలాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని శవాలను బయటకు తీయించారు. ఎస్‌ఐ విజయ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు ఒకే సారి

తల్లిదండ్రులు ఇద్దరు ఒకే సారి కన్ను మూయడంతో వారి ఇద్దరు కొడుకులు భిక్షపతి, మల్లికార్జున్ పసిప్రాయంలోనే కన్న వారి ప్రేమకు దూరమయ్యారు. వృద్ధాప్యంలో ఉన్న తాము కొడుకు, కోడలు మృతితో ఆధారం కోల్పోయామని బోరున విలపించారు. ఒకేసారి ఇద్దరి మరణంతో అటు చిన్నారులు, ఇటు వృద్ధులు గుండెలవిసేలా రోదిస్తున్న తీరు, గ్రామస్థులను కన్నీరు పెట్టించింది. భిక్షపతి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 3వ తరగతి చదువుతుండగా, మల్లికార్జున్ ఇంటి వద్దే ఉంటున్నాడు.

ఈతకెళ్లి ఇద్దరు చిన్నారులు మృతి


ఆయుశ్ కుమార్ మృతదేహం


సౌరబ్ కుమార్ మృతదేహం

పటాన్‌చెరు టౌన్: స్నేహితులతో కలిసి ఈతకెళ్లిన ఇద్దరు చిన్నారులు మృతిచెందిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కిష్టారెడ్డి కథనం ప్రకారం..బీహార్‌కు చెందిన సందీప్ చౌహాన్ బతుకు దెరువు కోసం మూడు సంవత్సరాల క్రితం అమీన్‌పూర్‌లోని హెచ్‌ఎంటీ స్వర్ణపురి కాలనీలో నివాసం ఉంటూ, సెంట్రింగ్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మూడో కుమారుడు యూకేజీ చదువుతున్న సౌరబ్ కుమార్(8), సందీప్ చౌహాన్ మరదలి కుమారుడు ఒకటో తరగతి చదువుతున్న ఆయూశ్ కుమార్(9) ఇరువురు స్నేహితులతో పీజేఆర్ ఎన్‌క్లేవ్ సమీపంలోని నీటి గుంతల వద్దకు వెళ్లారు. అయితే ఇద్దరు నీటి గుంతలో దిగి ఈత కొడుతుండగా ప్రమాదవశాత్తు మునిగి మృతిచెందారు. దీంతో వెంట వచ్చిన స్నేహితులు స్థానికులకు సమాచారం ఇచ్చారు. కిరణ్ అనే వ్యక్తి అక్కడికి వచ్చి ఇద్దరు పిల్లలను బయటకు తీసి చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించాడు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టు మార్టం కోసం పటాన్‌చెరు ఆసుపత్రికి తరలించారు. సందీప్ చౌహాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాపు చేస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురి అదృశ్యం

పెళ్లి ఇష్టం లేదని..


రఘుపతి

టేక్మాల్(మెదక్): ఈ నెల 21న పెళ్లి చేసుకోవాల్సిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండల కేంద్రమైన టేక్మాల్‌లో గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. టేక్మాల్ గ్రామానికి చెందిన కె.రఘుపతి అమెరికాలో సైంటిస్టుగా పనిచేస్తున్నాడు. గతనెలలో పెళ్లి సంబంధాలు చూడగా 18న నిశ్చితార్థం జరిగింది. ఈ నెల 14వ తేదీన రఘుపతి తనకు వివాహం ఇష్టంలేదని ఇంట్లో చెప్పి వెళ్లిపోయాడు. దీంతో కుటుంబీకులు అతనికోసం వెతకగా ఆచూకీ లభించలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు టేక్మాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ రమేశ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నీళ్ల బాటిల్ తెచ్చేందుకు వెళ్లి..

నర్సాపూర్: నీళ్ల బాటిల్ తెచ్చేందుకు బస్సు దిగిన యువతి మళ్లీ రాలేదు. స్థానిక ఎస్‌ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం..కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలంలోని కల్యాణి గ్రామానికి చెందిన కమ్మరిలక్ష్మి, రాములు దంపతులు. కొంత కాలం క్రితం రంగారెడ్డి జిల్లా బాచుపల్లిలోని సాయినగర్ కాలనీకి వలస వెళ్లారు. కాగా గురువారం కమ్మరి లక్ష్మి తన చిన్న కూతురు మాధవి (21)తో కలిసి స్వగ్రామం వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కారు. బస్సు నర్సాపూర్ బస్టాండుకు రాగానే మాధవి నీళ్ల బాటిల్ తెస్తానని బస్సుదిగింది. ఎంతకూ రాకపోయే సరికి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మనస్తాపానికి గురైన మహిళ..

తూప్రాన్: మంత్రాల నెపంతో ఓ మహిళను గ్రామస్తులు కొట్టడంతో అవమానంతో ఇంటి నుంచి కనిపించకుండ పోయింది. ఎస్‌ఐ సురేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..మాసాయిపేట మండలం నాగ్సాన్‌పల్లి గ్రామానికి చెందిన మంతూర్ మైసమ్మ(54). ఈ నెల 15 రాత్రి గ్రామస్తులు మంత్రాలు చేస్తుందని నానా బూతులు తిట్టి, కొట్టారని తూప్రాన్‌లో నివాసం ఉంటున్న కుమారుడు పేర్కొన్నాడు. దీంతో నాగ్సాన్‌పల్లి నుంచి తల్లి మైసమ్మను తూప్రాన్‌కు తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ క్రమంలో ఇంట్లో తల్లి కనిపించకుండా పోయిందని, ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుందని కుమారుడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

టీబీపేటకు చెందిన వ్యాపారి..

రామాయంపేట(మెదక్): కామారెడ్డి జిల్లా బీబీపేటకు చెందిన తౌడుపునూరి సాయిచంద్ అనే వ్యాపారి రామాయంపేటలో కనిపించకుండా పోయాడు. ఎస్‌ఐ రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం..ఈ నెల 15న రామాయంపేట బస్టాండులో హైదరాబాద్ వెళ్లే బస్సు ఎక్కిన సాయి చంద్ అప్పటినుంచి కనిపించడంలేదు. కుటుంబ సభ్యులు ఫోన్‌చేస్తే స్విచ్‌ఆఫ్ వస్తుంది. అతని ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలించినా లభించలేదు. దీంతో గురువారం తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సెల్ టవర్ ఎక్కి వ్యక్తి హల్‌చల్

మెదక్ రూరల్: భూమి కోసం సెల్ టవర్ ఎక్కి వ్యక్తి హల్‌చల్ చేసిన సంఘటన పాతూర్ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గామానికి చెందిన దూరబోయిన ప్రభాకర్‌కు అదేగ్రామానికి చెందిన డాక్టర్‌కు మధ్య ఉన్న భూ లావాదేవీల విషయమై మనస్థాపానికి గురై సెల్ టవర్ ఎక్కాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ప్రభాకర్‌కు నచ్చజెప్పి కిందకు దింపారు.

ఇద్దరికి ఏడాది జైలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): రాత్రి వేళల్లో దొంగతనాలకు పాల్పడిన ఇద్దరిని గజ్వేల్ న్యాయస్థానం ఏడాది జైలు శిక్ష విధించింది. ఎస్‌ఐ కృష్ణమూర్తి వివరాల ప్రకారం..మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన మన్నె ఐలయ్య, బత్తిని మహేశ్‌కుమార్ ఇద్దరు యువకులు రెండు నెలల క్రితం గ్రామంలో రాత్రి వేళల్లో దొంగతనాలకు పాల్పడి నగదును అపహరించారు. దీంతో వీరిపై కేసు నమోదు చేశారు. గురువారం న్యాయస్థానం నేరం రుజువు కావడంతో ఇద్దరికి ఆరు నెలల సాధారణ జైలు శిక్ష, మరో ఆరు నెలలు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్: కవరేజ్‌కు వెళ్లిన మీడియాను అసభ్య పదజాలంతో దూషించి, దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని పటాన్‌చెరు నియోజకవర్గ జర్నలిస్టులు అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి.. ఐదుగురికి గాయాలు

అంత్యక్రియలకు బైక్‌పై వెళ్తుండగా..

పటాన్‌చెరు టౌన్: బైక్‌పై సోదరుడి అంత్యక్రియలకు వెళ్తు ముందు వెళ్తున్న గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొని తీవ్రగాయాలైన ఘటనలో ఒకరు మృతిచెందగా, మరో వ్యక్తికి గాయాలైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం..హైదరాబాద్‌లోని మియాపూర్ హెచ్‌ఎంటి కాలనీకి చెందిన దేవసాయం(35), పోచయ్య ఇరువురు కలసి గురువారం ఉదయం బైక్‌పై మెదక్ జిల్లా టేక్మాల్ మండలం సంపలూరు గ్రామానికి వెళ్తుండగా పటాన్‌చెరు మండలం లక్డారం సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న గుర్తుతెలియని వాహనాన్ని బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో దేవసాయానికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయాలైన పోచ్చయ్యకు పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డీసీఎంను ఢీకొట్టి..


గాయపడిన శ్యామ్

దుబ్బాకరూరల్: బైక్ డీసీఎంను ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని తిమ్మాపూర్ వద్ద గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..రాజన్న సిరిసిల్లా జిల్లా ముస్తాబాద్‌కు చెందిన శ్యామ్, ముచ్చర్ల గ్రామానికి చెందిన కిషోర్‌లు బైక్‌పై సిద్దిపేట వైపు వెళ్తున్నారు. సిద్దిపేట నుంచి వస్తున్న డీసీఎం వ్యాన్ ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వెంకటాపూర్ చౌరస్తా వద్ద

నారాయణఖేడ్: నారాయణఖేడ్ మండలం వెంకటాపూర్ చౌరస్తా వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. నారాయణఖేడ్‌కు ద్విచక్రవాహనంపై వస్తున్న ఇద్దరిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో వారికి స్వల్ప గాయాలయ్యాయి. అటుగా కారులో వెళ్తున్న లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రకాశ్ రాథోడ్ 108కు ఫోన్‌చేసి చికిత్సనిమిత్తం ఆస్పత్రికి తరలించారు.


గాయపడ్డ మహిళను అంబులెన్స్‌లో ఎక్కిస్తున్న ప్రకాశ్ రాథోడ్

రిసెప్షన్ నుంచి తిరిగివస్తూ..


నాగమణి


అంతమ్మ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: పెళ్లి బృందంతో వెళ్తున్న డీసీఎం వాహనం ఓ లారీని గత శనివారం ఢీకొట్టిన ఘటనలో 49 మందిలో రాములమ్మ(63), కిష్టమ్మలు ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. ఐదుగురికి తీవ్రగాయాలై వారిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మరో 42 మందికి స్వల్ప గాయాలైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గాంధీ ఆసుపత్రిలో కాలు విరిగి చికిత్స పొందుతున్న చిట్కుల్ చెందిన నాగమణి (పెళ్లికూతురు) గురువారం చికిత్స పొందుతూ మృతిచెందగా, అదేగ్రామానికి చెందిన గౌడిచెర్ల అంతమ్మ (65) చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి కూలీలపై అడవి పంది దాడి

ఝరాసంగం(జహీరాబాద్): ఉపాధి కూలీలపై అడవి పంది దాడి చేసిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఈ దాడిలో ఇద్దరికీ గాయాలు అయ్యాయి. గ్రామస్తులు, కూలీల తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని బర్దిపూర్ గ్రామ శివారులో ఉపాధి హామీ పనులు కొనసాగుతున్నాయి. రోజు మాదిరిగానే గురువారం సుమారు 120 మంది కూలీలు గ్రామ శివారులో ఫీడర్ ఛానల్ పనులు చేపట్టేందుకు వెళ్లారు. పని ప్రదేశం వద్దకు వెళ్లగానే అక్కడ పొలం నుంచి అడవి పంది కూలీలపై దాడి చేసింది. ఈ దాడిలో గ్రామానికి చెందిన ఎర్రోళ్ల నర్సింలుకు కాలు విరిగిపోగా, మరో కూలీ బి.రుక్కమ్మకు గాయాలైనట్లు వివరించారు. గాయాలైన వారిని జహీరాబాద్ పట్టణంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం తరలించినట్లు వివరించారు.

కోతుల అక్రమ రవాణా

ఇద్దరిపై కేసు నమోదు


అటవీశాఖ అధికారుల అధీనంలో కోతుల వాహనం

నర్సాపూర్: వన్య ప్రాణులను పట్టి, అక్రమంగా రవాణా చేయబోయిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్‌ఓ అంబర్‌సింగ్ పేర్కొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి..యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఓ గ్రామం నుంచి కొన్ని కోతులను తెచ్చి నర్సాపూర్ అడవిలో వదలడానికి బుధవారం రాత్రి ప్రయత్నించిన స్థానికులు మహేందర్, గణపతిలపై అటవి శాఖ చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా కోతులను అక్రమంగా పట్టిన, రవాణా చేసిన కఠిన శిక్షలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు. అటవీ చట్టం ప్రకారం మూగజీవాలు పట్టినా, హింసించినా తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. నిందితులు పట్టుకొచ్చిన కోతులను నిర్మల్‌లోని వన్యప్రాణుల సంరక్షణ కేంద్రానికి తరలించామని ఎఫ్ఆర్‌ఓ అంబర్‌సింగ్ తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురు ఆత్మహత్య

అప్పుల బాధతో ఆర్టీసీ డ్రైవర్...

రామాయంపేట(మెదక్): నర్సాపూర్ డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్న మండలంలోని కాట్రియాల గ్రామానికి చెందిన గడీల శ్యామయ్య(45) గురువారం తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత ఏడాది కూతురు వివాహం చేయడంతోపాటు ఇంటి నిర్మాణంతో అప్పులపాలైన శ్యామయ్య గత కొంత కాలంగా ఇబ్బందులపాలవుతున్నాడు. మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం గదిలో విశ్రాంతి తీసుకుంటానని చెప్పి గడియ పెట్టుకున్నడు. అనంతరం ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని కుమారుని ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రంజిత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకొని యువకుడు...

కంది(సంగారెడ్డి): ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కందిలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి కథనం ప్రకారం..కందికి చెందిన పల్లె శ్రీకాంత్(24) ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. కొన్ని రోజులుగా శ్రీకాంత్‌కు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. అవి కుదరకపోవడంతో మనస్థాపానికి గురైన శ్రీకాంత్ గురువారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తండ్రి మందలించాడని కొడుకు...

మెదక్ రూరల్: తండ్రి మందలించాడని కొడుకు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెదక్ మండలం జానకంపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన దివిటి షాదుల్(22)ను పని సక్రమంగా చేసుకోవాలని తండ్రి మందలించడంతో ఇంట్లో పొలం వద్దకు వెళ్తునట్లు చెప్పాడు. ఆ తర్వాత తన స్నేహితుడు కిరణ్‌కు ఫోన్ చేసి పురుగుల మందు తాగి చనిపోతునట్లు సమాచారం ఇచ్చాడు. దీంతో కంగారు పడిన అతను అక్కడికి చేరుకొని తన బైక్‌పై ఓ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అనంతరం వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్సనిమిత్తం హైదరాబాద్ నారాయణ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయినట్లు తెలిపారు. తండ్రి భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మనస్తాపంతో యువతి ...


నిఖిత మృతదేహం

పటాన్‌చెరు టౌన్: చాతిలో క్యాన్సర్ గడ్డలయ్యాయని మనస్థాపంతో ఓ యువతి ఆత్మహత్య చేసుకొంది. ఎస్‌ఐ సాయిలు తెలిపిన వివరాల ప్రకారం..రామచంద్రాపురం మండలం ఈదులనాగులపల్లికి చెందిన నిఖిత(18) గత కొద్ది రోజుల క్రితం చాతిలో గడ్డలు కావడంతో సోదరుడు గోవర్ధన్ కొల్లారు సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చూపించారు. అక్కడ వైద్యులు క్యాన్సర్ గడ్డలని పరీక్షల అనంతరం చెప్పారు. ముందు మాత్రలు వాడాలని, తగ్గకుంటే ఆపరేషన్ చేస్తామని వైద్యులు సూచించారన్నారు. ఈ క్రమంలో అప్పటి నుంచి మనస్థాపం చెందిన నిఖిత గురువారం తల్లి, సోదరుడు ఇద్దరు బయటకు వెళ్లగానే ఇంట్లో వదిన మేఘన ఉంది. ఆమెకు స్నానాకి వెళ్తున్నానని చెప్పి గడియ వేసుకొంది. ఎంత సేపటికి నిఖిత బయటకు రాలేదు. దీంతో అనుమానం వచ్చిన వదిన ఎంత పిలిచినా తలుపులు తీయకపోవడంతో భర్త గోవర్ధన్‌కు సమాచారం ఇచ్చింది. ఇంటికి వచ్చిన గోవర్ధన్ తలుపులు పగలగొట్టి లోనికి వెళ్లి చూడగా చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకొని కనిపించింది. దీంతో నిఖితను నల్లగండ్లలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా ఆమెను పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టరు కింద పడి రైతు మృతి

కొండపాక(గజ్వేల్): ధాన్యాన్ని మార్కెట్‌కు ట్రాక్టరులో తీసుకెళ్తూ ప్రమాదవ శాత్తు ట్రాక్టరు కిందపడి రైతు లడే నర్సింగరావు(48) అక్కడిక్కడే మృతి చెందినట్లు ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి..ఆరెపల్లికి చెందిన రైతు నర్సింగరావు ధాన్యాన్ని ట్రాక్టరులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్తున్నాడు. ప్రమాదవశాత్తు పొలంలో ఉన్న ఎతైన ఒడ్డును ఎక్కిస్తుండగా బోల్తా పడింది. దీంతో రైతు నర్సింగరావు ట్రాలీ కిందపడి అక్కడిక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు, గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకొని కన్నీరు మున్నీరుగా విలపించారు. కుటుంబీకుల ఫిర్యాదు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా

మెదక్ మున్సిపాలిటీ: ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ప్రమాదవశాత్తు బోల్తాపడిన సంఘటన గురువారం మెదక్ బస్సు డిపోవద్ద చోటు చేసుకుంది. ట్రాక్టర్ ఎక్సల్ విరగడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని తెలిపారు. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్పగాయాలు అయ్యాయని పేర్కొన్నారు.

మామిడి పండ్ల వ్యాను...

జోగిపేట(అందోల్): మామిడి పండ్ల వ్యాను వెనుక టైర్ పగిలిపోవడంతో అదుపుతప్పి కన్‌సాన్‌పల్లి గ్రామం వద్ద జాతీయ రహదారిపై బోల్తాపడింది. అనంతపురం జిల్లా కదిరి నుంచి ఇండోర్ వైపు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. మామిడి పండ్లన్నీ రోడ్డు పాలయ్యాయి. దీంతో వెంటనే జోగిపేట ఎస్‌ఐ-2 జయశంకర్ సంఘటన స్థలానికి చేరుకొని మామిడి పండ్లను వ్యానులోకి ఎత్తించారు.

పగిలిన లారీ టైర్లు..తప్పిన ప్రమాదం

కొల్చారం(నర్సాపూర్): సిమెంటు లోడుతో వెళ్తున్న లారీ టైర్లు పగలడంతో తృటిలో ప్రమాదం తప్పింది. రంగంపేట శివారులో గురువారం జరిగింది. జోగిపేట నుంచి రంగంపేటకు వస్తున్న లారీ పీఏసీఎస్ సమీపంలోకి రాగానే ఘటన చోటుచేసుకుంది.

విహారయాత్రలో ఫిట్స్‌తో యువకుడి మృతి

శివ్వంపేట(నర్సాపూర్): 25 మందితో కలిసి విహారయాత్రకు వెళ్లి అక్కడ ఫిట్స్ వచ్చి యువకుడు సముద్రంలో నీట మునిగి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని దొంతి గ్రామానికి చెందిన 25మంది ఈ నెల 14న ట్రావెల్ బస్సులో గోవా విహారయాత్రకు వెళ్లారు. తిరుప్రయాణంలో కర్నాటకలోని మురుడేశ్వర్‌లో బుధవారం సాయత్రం సముద్ర స్నానం చేస్తుండగా మెతుకు హరికృష్ణ(25) ఫిట్స్ వచ్చి నీటమునిగి పోయాడు. దీన్ని గుర్తించిన తోటివారు వెంటనే నీటిలో నుంచి బయటకు తీశారు. అనంతరం స్థానిక ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. అప్పటి వరకూ అందరు ఉత్సాహంగా విహారయాత్రలో ఉన్నవారందరూ ఒక్కసారిగా దుఃఖ సాగరంలో మునిగిపోయారు. ఈ సంఘటన గురించి కుటుంబ సభ్యులకు, గ్రామస్థులకు సమాచారం అందించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతిడికి భార్య విజయ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టుచేసిన సంఘటన తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోబుధవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..కొల్లూరులో కూలీలు నివాసం ఉండే ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నటు పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు నిఘా పెట్టి గంజాయి విక్రయిస్తున్న శ్రీధర్ గౌడ్, చికెన్ వ్యాపారి అనంఉద్దీన్‌లను అదుపులోకి తీసుకొని విచారించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన సుకుమార్ వద్ద కిలో రూ.2వేలకు తీసుకొని వాటిని ఒక గ్రాము చొప్పున ప్యాక్ చేసి ఖూ.200లకు విక్రయిస్తున్నట్లు వారు పోలీసుల విచారణలో పేర్కొన్నారు. వారి వద్ద నుంచి 900గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్‌లు, రూ.8వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

కొడుకు మరణంపై తండ్రి ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్: కొడుకు మరణంపై అనుమానం ఉందని ఓ తండ్రి ఫిర్యాదు చేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌కు చెందిన ఇస్మాయిల్(32)కు 13సంవత్సరాల క్రితం రుద్రారం గ్రామానికి చెందిన ఫాతిమాతో వివాహం జరిగింది. గత కొద్ది రోజులుగా ఇస్మాయిల్ అతని భార్య కుటుంబ కలహాలతో ఇద్దరు దూరంగా ఉంటున్నారు. బుధవారం ఇరువురి కుటుంబ సభ్యులు మాట్లాడి సర్దిచెప్పారు. ఇస్నాపూర్లో అద్దెకు రూమ్ ఇప్పించారు. ఈ క్రమంలో రూమ్‌ను శుభ్రం చేస్తుండగా తాగిన మైకంలో భార్యతో గొడవపడ్డాడు. కాగా సాయంత్రం 7గంటల సమయంలో సడ్డకుడైన ఖాజా మొయినుద్దీన్, ఇస్మాయిల్ ఇద్దరు కలసి రుద్రారంలోని ప్యాలెస్ హోటల్‌కు వెళ్లారు. ఈ విషయాన్ని అతను తండ్రి నహీమ్‌కు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. ఇద్దరం రుద్రారం ప్యాలెస్ హోటల్ ఉన్నామని తండ్రితో చెప్పాడు. ఈ క్రమంలో తండ్రి కొడుకును ఇంటికి రమ్మన్నాడు. అతను తన సడ్డకుడు ఖాజామొయినుద్దీన్ వద్ద ఉంటానని చెప్పాడు. అనంతరం ఇరువురు మద్యం సేవించి రుద్రారం వెళ్లారు. ఇస్మాయిల్ ఇంట్లో భోజనం చేసినంతరం వాంతులు చేసుకొని స్పృహ కోల్పోయాడు. దీంతో ఖాజామొయినుద్దీన్, కుటుంబ సభ్యులతో ఇస్మాయిల్‌ను చికిత్స నిమిత్తం ఇస్నాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి, అక్కడినుంచి పటాన్‌చెరులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం వైద్యుల సలహా మేరకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి తండ్రి నహీమ్ కొడుకు మృతిపై అనుమానం ఉందని ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

ఎల్లమ్మ ఉత్సవాలకు ఆహ్వానం



మంత్రి హరీశ్‌రావుకు ఆహ్వానం అందిస్తున్న నాయకులు

దుబ్బాకటౌన్: పట్టణంలో ఈ నెల 21 నుంచి ఐదు రోజులపాటు జరిగే రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలకు రావాలని కోరుతూ గురువారం హైదరాబాద్‌లో మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిలను గౌడ సంఘం నాయకులు కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. కార్యక్రమంలో నాయకులు బాలేశ్‌గౌడ్, రామస్వామిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, వెంకట్‌గౌడ్ ఉన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సాయిలు

మిరుదొడ్డి(దుబ్బాక): రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఎంపీపీ గజ్జెల సాయిలు కోరారు. మిరుదొడ్డి పీహెచ్‌సీలో గురువారం జన ఆరోగ్య సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజారోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుందన్నారు. పీహెచ్‌సీకి వచ్చే రోగులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. పీహెచ్‌సీకి మంజూరైన నిధులను సక్రమంగా వినియోగించి అన్ని వసతులను సమకూర్చుకోవాలని సూచించారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజిరెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ ఎండీ.అహ్మద్, డాక్టర్ సమీనా సుల్తానా, లింగమూర్తి, సర్పంచ్ రాములు, ఎంపీటీసీ రాములు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత



బహుమతులు అందజేస్తున్న ఎంపీడీవో అనురాధ తదితరులు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని రసులాబాద్ గ్రామంలో నిర్వహించిన మండల స్థాయి సీఎం కప్ విజేతలకు గురువారం ఎంపీడీవో అనురాధ, సర్పంచ్ పచ్చిమడ్ల స్వామితో కలసి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి, ఎంపీవో మంజుల, పీఈటీ అశోక్, పంచాయతీ కార్యదర్శులు కిరణ్, బాల్‌రాజు, జూనియర్ అసిస్టెంట్ బాలచంద్రం పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన బీఆర్‌ఎస్ మండల నాయకులు



కలెక్టర్‌కు సమస్యలు తెలుపుతున్న నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌ను గురువారం బెజ్జంకి మండలానికి చెందిన బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు లింగాల లక్ష్మణ్, మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డిలు కలిసి మండలంలో నెలకొన్న సమస్యలు తెలిపారు. సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ దీటి రాజు తదితరులు పాల్గొన్నారు.

కురుమ సంఘం జిల్లా కార్యదర్శిగా రమేశ్



నియామకపత్రం అందిస్తున్న మల్లేశం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కురుమ సంఘం జిల్లా కార్యదర్శిగా రాఘవాపూర్‌కు చెందిన కంతుల రమేశ్‌ను నియమిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం తెలిపారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కోరే ఎల్లయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిందం రాజమల్లయ్య, కొండపాక మండల అధ్యక్షుడు ఎర్రోల్ల రమేశ్, కరికే యాదగిరి, కంచు నర్సింలు, బైతి శ్రీనివాస్, కంతుల స్వామి, బైతి మహేశ్, కొన్నె మల్లేశం, జిందం తిరుపతి, బర్మ అయిలమ్మ, జంగం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

చేర్యాల(సిద్దిపేట): గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధికి నోచుకోని పల్లెల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించి చర్యలు చేపడుతుందని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని దొమ్మాట గ్రామంలో రూ.13.60లక్షల వ్యయంతో చేపడుతున్న అంగన్‌వాడీ భవనానికి శంకుస్థాపన చేశారు. అనంతరం నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ, మహిళా భవనాన్ని ప్రారంభించారు. అదేవిధంగా గ్రామంలో నిర్మించిన 10 డబుల్ బెడ్రూం ఇళ్లకు సంబంధించిన లబ్ధిదారులకు పట్టాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్ర పాలకుల పాలనలో తెలంగాణ ప్రాంత పల్లెలు అభివృద్ధికి నోచుకోకపోగా పూర్తిగా వెనకబడిపోయాయన్నారు. పల్లెల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అభివృద్ధి పనులు చేపడుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సీఎం కేసీఆర్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు అనవసరపు ఆరోపణలు చేస్తున్నాయన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణాలో తిరిగి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఓ బీజేపీ నాయకుడు రైతు రుణ మాఫీ చేయలేదని ప్రశ్నిస్తుండగా పోలీసులు వారించి అక్కడి నుంచి పంపించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, సర్పంచ్ గాడిపల్లి సుభాషిణి, మార్కెట్ కమిటీ చైర్మన్ సుంకరి మల్లేశం, ఎంపీటీసీ ముచ్చెంతుల వినోదచుక్కారెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, రైతుబంధు జిల్లా కమిటీ సభ్యుడు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ ఆరీఫా, ఎంపీడీఓ తారిక్‌అన్వర్, ఎంపీఈఓ మహబూబ్‌అలీ, గ్రామస్తులు, మండల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే

నాడు ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్ర పాలకుల పాలనలో తెలంగాణకు, నేడు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అనంతరం సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణకు వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించి, అధికారం కోసం పాకులాడుతున్న ప్రతిపక్షాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని స్థానిక ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మండల క్లస్టర్–2 గ్రామాలైన ఆకునూరు, రాంపూర్, కాశగుడిసెలు, కొత్తదొమ్మాట, దొమ్మాట, గుర్జకుంట, తాడూరు, దానంపల్లి, చిట్యాల గ్రామాల బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, గ్రామ శాఖ, అనుబంధ సంఘాల బాధ్యులు, పార్టీ అభిమానులు, మహిళలు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చేస్తున్న అసత్య ప్రచారాలను గులాబీ శ్రేణులు తిప్పికొట్టాలన్నారు. సీఎం కేసీఆర్‌తో పాటు తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత తెలంగాణ ప్రజలపై ఉందన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 45 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను ఆయా గ్రామాల సర్పంచ్‌లు, తహసీల్దార్ ఆరీఫాతో కలిసి పంపిణీ చేశారు. అదేవిధంగా మండల స్థాయిలో నిర్వహించిన సీఎం కప్ పోటీల్లో విజేతలకు ఎంపీడీఓ అన్వర్, ఎంపీఈఓ మహబూబ్‌అలీలతో కలిసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కరుణాకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వరూపరాణి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు బాల్‌నర్సయ్య, మండల అధ్యక్షుడు మల్లేశం, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామికి అన్నాభిషేకం



స్వామివారికి అన్నాభిషేకం చేస్తున్న భక్తులు

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని మర్పడ్గలో గల విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో నిర్వాహకులు చెప్పెల హరినాథ శర్మ ఆధ్వర్యంలో గురువారం వైశాఖ మాస శివరాత్రిని పురస్కరించుకొని సంతాన మల్లికార్జునస్వామికి అన్నాభిషేకం నిర్వహించారు. ఉదయం 8 గంటలకు గణపతి పూజతో ప్రారంభమై విశేష పంచామృత ఫలరస అభిషేకం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దుర్గామాతకు విశేష పూజలు చేశారు. అనంతరం నిరాజన సేవ మంత్ర పుష్పం, తీర్థప్రసాద వితరణ చేశారు.

సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం సరికాదు

దుబ్బాక: వీఓఏల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని వీవోఏల దౌల్తాబాద్ మండల కార్యదర్శి కవిత మండిపడ్డారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ గురువారం దౌల్తాబాద్ మండల కేంద్రంలో వీఓఏలు సమ్మె చేపట్టారు. మొదటి రోజు సమ్మెలో భాగంగా దౌల్తాబాద్ మండల కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి తమ సమస్యలపై వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం రూ.26వేల కనీస వేతనం అందించడంతో పాటు, ఉద్యోగ భద్రత, ఆరోగ్య బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హత గల వీఓఏలకు సీసీలుగా ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీవోఏలు దేవేంద్ర, అనిత, షాహినా, రజిత, బాల్‌రెడ్డి, మహేందర్, నర్సింలు, భాస్కర్, సురేందర్ తదితరులున్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న వీఓఏలు

బూత్ కమిటీలను పటిష్టం చేద్దాం



ముఖ్య కార్యకర్తల సమావేశంలో నాయకులు

కొండపాక(గజ్వేల్): బూత్ కమిటీలు పటిష్టం అయ్యేలా పనిచేద్దామని బీజేపీ మండల అధ్యక్షుడు మన్నెం శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని దుద్దెడ శివారులో గల ఎల్లమ్మ ఆలయ ఆవరణలో గురువారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే ఆరునెలల కాలం ఎన్నికల నిర్వహణ కాలమన్నారు. ఆయా గ్రామాల్లో చాలా మంది యువత బీజేపీలో చేరేందుకు ఉత్సాహం చూపుతున్న విషయాన్ని గుర్తిస్తూ పార్టీలో చేరే విధంగా పనిచేయాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ జెండా ఎగిరేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంరెడ్డి, గురువారెడ్డి, రాములు, సాయి, సురేశ్, సత్యం, రామస్వామి, హరికిషన్, రాజు, ఆంజనేయులు, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బొడ్రాయి ఉత్సవాలు



బోనాల ఊరేగింపులో భక్తులు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని బొబ్బాయిపల్లి గ్రామంలో గురువారం బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠ 5వ వార్షికోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ రవీందర్ దంపతులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పూజలు సాయంత్రం 6 గంటలకు ముగిశాయి. మధ్యాహ్నం హోమం నిర్వహించి బొడ్రాయి విగ్రహాలకు గ్రామస్తులు జలాభిషేకం నిర్వహించారు. సాయంత్రం బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవార్లకు సమర్పించుకున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని శనిగరం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి సోదరుడు కర్ర నర్సయ్య గురువారం మృతి చెందగా బాధిత కుటుంబాన్ని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ పరామర్శించి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా మండలంలోని తీగలకుంటపల్లి సర్పంచ్ మ్యాకల చంద్రశేఖర్‌రెడ్డి తండ్రి మ్యాకల మోహన్‌రెడ్డి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పాత సర్వే ప్రకారం కాల్వ నిర్మించాలి

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ఆకునూరు రెవెన్యూ పరిధిలో గల భూముల నుంచి నూతనంగా చేపడుతున్న దేవాదుల కాల్వ నిర్మాణం నిలిపివేసి గతంలో చేసిన సర్వే ప్రకారం కాల్వ పనులు కొనసాగించాలంటూ ఆకునూరు, రాంపూర్ గ్రామాలకు చెందిన రైతులు తహసీల్దార్ ఆరీఫాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. గతంలోనే సర్వే చేపట్టి భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం చెల్లించి, కాల్వ నిర్మాణ పనులు చేపట్టారన్నారు. కొన్ని కారణాలతో పనులు నిలిచిపోగా కొందరు వారి స్వలాభం కోసం కాల్వ డిజైన్ మార్చి మా భూముల గుండా నిర్మించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. మా ప్రధాన జీవనాధారమైన వ్యవసాయ భూముల నుంచి చేపట్టాలని చూస్తున్న కాల్వ నిర్మాణంతో మాకు ఎలాంటి ప్రయోజనం ఉండదని, పైగా మేము భూమి కోల్పోయి రోడ్డున పడాల్సిన పరిస్థితి నెలకొంటుంది, కావున కాల్వ నిర్మాణానికి భూములు ఇవ్వడానికి అంగీకరించడం లేదన్నారు. బలవంతంగా లాక్కునే ప్రయత్నం చేస్తే ఆత్మహత్యలకు వెనకాడబోమన్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు స్పందించి గతంలో చేసిన సర్వే ప్రకారం పాత కాల్వ యథావిధిగా కొనసాగించాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చామన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు

సంక్షిప్త వార్తలు

◆ **బాధిత కుటుంబానికి చేయూత**

దుబ్బాక: దౌల్తాబాద్ మండలం ఇందూప్రియల్ గ్రామానికి చెందిన దివ్యాంగుడు వెంకటేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామస్తులు రూ.41వేలను జమచేసి రూ.10 వేలను గ్రామ పంచాయతీ పాలకవర్గం వెంకటేశ్ దహన సంస్కారాలకు ఖర్చు చేశారు. మిగిలిన రూ.31 వేలను గురువారం వెంకటేశ్ కూతుర్ల పేరుపై సుకన్య సమృద్ధి స్కీమ్‌లో జమ చేసినట్లు సర్పంచ్ శ్యామల కుమార్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి, స్వామి, రాజు, భాస్కర్, భరత్, తదితరులున్నారు.

◆ **జీలుగ విత్తనాలు పంపిణీ**

కొమురవెల్లి(సిద్దిపేట): మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో రైతులకు 65 శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలను గురువారం జెడ్పీటీసీ సిద్దప్ప, ఆలయ చైర్మన్ గీస భిక్షపతితో కలసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో లింగంపల్లి కనకరాజు, తాళ్లపల్లి కనకయ్య, స్వామి, భిక్షపతి పాల్గొన్నారు.

◆ **అందరికీ దళితబంధు ఇవ్వాలి**

గజ్వేల్‌రూరల్: అభివృద్ధిలో భాగస్వాములై భూములు కోల్పోయిన దళితులందరికీ దళితబంధు అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మాల మహానాడు రాష్ట్ర యువజన కార్యదర్శి నీరుడిస్వామి పేర్కొన్నారు. గురువారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గజ్వేల్‌లో చేపట్టిన ప్రాజెక్టుల్లో దళితులు విలువైన భూములను కోల్పోయి తీవ్రంగా నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలో రైల్వేలైన్, డంపింగ్‌యార్డుతో పాటు కాల్వల కోసం దళితులకు చెందిన సుమారు 45ఎకరాల వరకు భూసేకరణ చేపట్టారని గుర్తు చేశారు. ఆ భూముల ధరలు విపరీతంగా పెరిగినా ఎకరాకు రూ.10.50లక్షల పరిహారం మాత్రమే చెల్లించారని తెలిపారు. మాయమాటలతో ప్రజలను మభ్యపెట్టకుండా సంక్షేమ పథకాలను వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

◆ **ఉత్సవాలకు విరాళం**

వర్గల్(గజ్వేల్): వర్గల్ స్వయంభూ శంభు లింగేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలకు గురువారం ఉపసర్పంచ్ పసుల రమేశ్ ముదిరాజ్ రూ.11వేల విరాళం అందజేశారు. సమాజంలో ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకొని, సన్మార్గంలో నడవాలని ఆయన పేర్కొన్నారు.

◆ **రెండోరోజూ కొనసాగిన పారిశుధ్య పనులు**

బెజ్జంకి(సిద్దిపేట): ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా మండల కేంద్రంలో సిబ్బంది గురువారం శ్రమదానం చేసి వీధులను శుభ్రం చేశారు. పిచ్చి మొక్కలను తొలిగించారు. కల్లెపెల్లి, పెరుకబండ, గుగ్గిల్ల, వడ్లూరు, వీరాపూర్, గూడెం, చిలాపూర్ గ్రామాల్లోడ్రైనేజీల మురుగు నీటి సమస్య పరిష్కారం కోసం ఇంకుడు గుంతలకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకశక్తిని వెలికితీయాలి



శిక్షణకు హాజరైన విద్యార్థులు

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకశక్తిని వెలికితీయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రూం టూ రీడ్ మండల కో–ఆర్డినేటర్ మధుకర్‌రెడ్డి కోరారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని భూంపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం రూం టూ రీడ్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణ శిబిరంలో పిల్లల పఠనాసక్తి, సృజనాత్మకను పెంపొందించడానికిగానూ డ్రాయింగ్, స్టోరీ టెల్లింగ్, స్టోరీ రీడింగ్, రోల్ ప్లే లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రూం టూ రీడ్ శిక్షణ కార్యక్రమానికి ప్రభుత్వ విద్యార్థులే కాకుండా ప్రైవేట్ విద్యార్థులు సైతం సద్వినియోగం చేసుకోవడం ఆనందకరమన్నారు. వేసవి సెలవులను వృథా చేయకుండా ఇలాంటి రూం టూ రీడింగ్ శిక్షణ శిబిరాలను విద్యార్థులు వినియోగించుకునేలా తల్లిదండ్రులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

‘దుబ్బాకలో బీఆర్‌ఎస్ విజయం ఖాయం’



మాట్లాడుతున్న నాయకులు

దుబ్బాకటౌన్: దుబ్బాక నియోజకవర్గంలో ఎగిరేది గులాబీ జెండానే అని బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండవెల్లి ఎల్లారెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షుడు పల్లె వంశీకృష్ణాగౌడ్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని లచ్చపేట 10, 11వ వార్డుల కౌన్సిలర్లు కూరపాటి బంగారయ్య, నందాల శ్రీజ శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో 31, 31 బూత్‌ల అధ్యక్షులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా 31వ బూత్ అధ్యక్షుడిగా కూరపాటి వెంకటేశ్(నాని), 32వ బూత్ అధ్యక్షుడిగా ఎండీ సాదిక్ అలీలతో పాటు యూత్, సోషల్ మీడియా అధ్యక్షులుగా ఆసరి రమేశ్, షారూఖాన్, ఇస్తారిగల్ల అనిల్, బందారపు దేవేందర్‌గౌడ్, ఫహద్, నరేందర్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు గన్నె భూంరెడ్డి, బడుగు రాజు, రాంప్రసాద్, ఆస రవి, మంచె శ్రీనివాస్, మలేషియా శ్రీనివాస్, కృష్ణ, శ్రీశైలం, యాదగిరి, భాగ్యమ్మ, సావిత్రి, పద్మ, కైసర్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

తొగుట(దుబ్బాక): దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు ఫ్లెక్సీకి బీజేపీ మండల కార్యదర్శి తోలుకంటి రాజు ఆధ్వర్యంలో గురువారం పెద్ద మాసాన్‌పల్లిలో క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కృషితో మాసాన్‌పల్లి, ఎల్లారెడ్డిపేట, బండారుపల్లి గ్రామాలకు బీటీ రోడ్డుకు మోక్షం కలిగిందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కార్యకర్తలు ఆంజనేయులు, కరుణాకర్, ప్రశాంత్, శ్రీకాంత్, అజయ్, నవీన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలి



కళాశాలలో చేరాలని విద్యార్థిని తల్లిదండ్రులను కోరుతున్న అధ్యాపకులు

నంగునూరు(సిద్దిపేట): విద్యార్థులను ప్రభుత్వ కళాశాలలో చేర్పిస్తే నాణ్యమైన విద్య అందుతుందని సర్పంచ్ పంగ కుమారస్వామి, అధ్యాపకుడు నంట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు గురువారం పాలమాకులలో ఇంటింటా తిరుగుతూ తమ కళాశాలలో చేరాలని పదో తరగతి పాసైన విద్యార్థులను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలలో విశాలమైన ల్యాబ్ సౌకర్యంతో పాటు సుశిక్షితులైన అధ్యాపకులతో బోధన చేస్తారని, స్కాలర్‌షిప్, పుస్తకాలు ఉచితంగా అందజేస్తారన్నారు. కార్యక్రమంలో దరిపల్లి నగేశ్, రేవంత్, కొమురయ్య, వేల్పుల అయిలయ్య పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో బియ్యం అందుబాటులో ఉంచాలి

చేర్యాల(సిద్దిపేట): ప్రతి నెల 1వ తేదీన మండల పరిధిలోని గ్రామాల్లో రేషన్ బియ్యం అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతూ సీపీఐ నాయకులు గురువారం స్థానిక తహసీల్దార్ షేక్ ఆరీఫాకు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈ నెల 18వ తేదీ వచ్చినా గ్రామాల్లో రేషన్ బియ్యం అందక ప్రజలు తిండికి లేక అలమటించి పోతున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 30వ తేదీవరకు రేషన్ అందించే సమయాన్ని పొడిగించి, వచ్చే నెల నుంచి 1వ తేదీన అన్ని రేషన్ షాపుల్లో బియ్యం, సరుకులు అందుబాటులో ఉంచే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు భూమయ్య, భాస్కర్‌రెడ్డి, మల్లయ్య, రాజు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వార్డుల్లో పారిశుధ్య కార్యక్రమాలు



హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయం

హుస్నాబాద్: పట్టణంలో ఈ నెల 19 నుంచి 27 వరకు వార్డుల వారీగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య తెలిపారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త విడివిడిగా సేకరించడం, పేరుకుపోయిన చెత్త కుప్పలు తొలగించేందుకు చర్యలు, భవన నిర్మాణాల కూల్చివేతల వ్యర్థాలను తొలగించుట, పిచ్చిమొక్కలు తొలగించి పరిసరాలను శుభ్రం చేయడం, మురికి కాల్వల్లో దోమల మందు, క్రిమి సంహారక మందులు, బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయడం, వార్డుల్లో తడి చెత్తతో ఎరువు తయారీపై అవగాహన కల్పించడం, అన్ని వార్డుల్లో ఫాగింగ్ స్ప్రే చేయడం వంటి పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టనున్నట్లు కమిషనర్ తెలిపారు.

అధికారుల నియామకం

పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా వార్డుల వారీగా అధికారులను నియమించినట్లు కమిషనర్ రాజమల్లయ్య తెలిపారు. ఈ నెల 19న 1వ వార్డుకు ప్రత్యేక అధికారి ప్రశాంత్, 12వ వార్డుకు అధికారి కృష్ణ, 20న 2వ వార్డుకు అధికారి శంకర్, 13వ వార్డుకు అధికారి సహదేవ్, 21న 15 వార్డుకు అధికారి నరేశ్, 3వ వార్డుకు అధికారి రాజమౌళి, 22న 4వ వార్డుకు అధికారి శ్రీకాంత్, 16వ వార్డుకు అధికారి శేఖర్, 23న 6వ వార్డుకు అధికారి కోటి, 7వ వార్డుకు అధికారి సృజన్, 24న 8వ వార్డుకు అధికారి గిరిప్రసాద్, 9వ వార్డుకు అధికారి వెంకటస్వామి, 25న 5వ వార్డుకు అధికారి సాదిక్, 14వ వార్డుకు అధికారి బి.రవి, 26న 10వ వార్డుకు అధికారి డి.తిరుపతి, 11వ వార్డుకు అధికారి శారద, 19వ వార్డుకు అధికారి ఎల్లయ్య, 27న 17వ వార్డుకు అధికారి రాజు, 18వ వార్డుకు అధికారి శివకుమార్, 20వ వార్డుకు అధికారి సతీశ్‌లతో పాటుగా వార్డుల వారీగా అదనంగా ఆర్పీలను నియమించినట్లు కమిషనర్ రాజమల్లయ్య తెలిపారు.

వలకు చిక్కిన 15 కిలోల చేప



దుబ్బాక: ఒకటి రెండు కాదు ఏకంగా 15 కిలోల చేప వలకు చిక్కింది. దౌల్తాబాద్ మండలం తిమ్మక్కపల్లికి చెందిన ఇప్ప దయాకర్ గురువారం చెరువులో చేపలు పడుతుండగా వలకు 15 కిలోల చేప చిక్కింది. అక్కడికి వచ్చిన అందరూ ఆశ్చర్యంగా చూశారు.